సాక్షి కామారెడ్డి

శుక్రవారం ၊ 6 ၊ డిసెంబర్ ၊ 2024



ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని బీజేపీ నాయకులు అన్నారు.

- 8లో ▸



ఆర్థికాభివృద్ధి సాధించాలి

రైతులు అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /19.5


వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

ఏడాదిలో ఎన్నో సాధించా..

- తాగునీటి కోసం 320 బోర్లు వేయించాను
- 22వ ప్యాకేజీ పనులను పూర్తి చేయించే బాధ్యత నాదే
- ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు చేసి తీరుతా
- ఐటీ పార్కుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తా
- మంత్రి పదవి వస్తుందన్న నమ్మకంతో ఉన్నా..
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

సాక్షి ఇంటర్వ్యూ



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: 'వెనుకబాటుకు గురైన ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించి వాటిని సక్సెస్ చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నా. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో 320 బోర్లు తవ్వించి మోటార్లు బిగించాను. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎల్‌వోసీలు ఎక్కువ సంఖ్యలో ఇప్పించాను. సీఎంఆర్‌ఎఫ్ కూడా ఎక్కువ మందికి ఇప్పించి వారి ఇంటి వద్దకే చెక్కులు పంపిస్తున్నాను. నియోజకవర్గంలో సాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రామారెడ్డి మండలాలకు నీరందించే 22వ ప్యాకేజీ పనులపై ఉన్నత స్థాయిలో పలుమార్లు రివ్యూ చేసి కొలిక్కి తెచ్చాను. ఇంకా చేయాల్సినవి ఎన్నో ఉన్నాయి. నాలుగేళ్లలో అన్నింటినీ చేసి తీరుతా' అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె మదన్‌మోహన్‌రావు అన్నారు. మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం వస్తుందనే నమ్మకంతో ఉన్నానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ నేతలంతా తనను అన్ని విషయాల్లోనూ ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చే నెల జీతంతో పాటు అలవెన్స్‌లను నియోజకవర్గంలోని నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

22వ ప్యాకేజీ పనులపై సమీక్ష

నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సాగునీరందించే 22వ ప్యాకేజీ పనుల కోసం మంత్రితో పాటు ఉన్నత స్థాయి అధికారులతో పలుమార్లు సమావేశమయ్యాను. లక్ష ఎకరాల పైచిలుకు సాగునీరిచ్చే ఈ పథకం పనుల కోసం రూ.1300 కోట్లు ఖర్చవుతున్నాయి. ఈఎన్‌సీతో పాటు సీఈలతో ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తూ పనుల్లో పురోగతి సాధించేందుకు ప్రయత్నిస్తున్నా. ఈ పనులు పూర్తయితే సాగునీటికి ఇబ్బంది ఉండదు.

నాలుగు వరుసలుగా కేకేవై రోడ్డు

ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి మీదుగా కరీంనగర్ వరకు విస్తరించి ఉన్న కేకేవై రోడ్డును నేషనల్ హైవే కింద అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాను. రాష్ట్ర రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఈ నెల 11న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తున్నాం. కేకేవై రోడ్డు నాలుగు వరుసలుగా అభివృద్ధి చెందితే రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతుంది. మెదక్ నుంచి ఎల్లారెడ్డి మీదుగా బాన్సువాడ వరకు రోడ్డు పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ రోడ్లు పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

వచ్చే వారంలో 'డబుల్' ఇళ్ల పంపిణీ

ఎల్లారెడ్డిలో నిర్మించిన మూడు వందల డబుల్ బెడ్‌రూం ఇళ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించి, కాలనీలో రోడ్లు వేయిస్తున్నాం. వాటిని అర్హులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే వారం ఇళ్లను పంపిణీ చేస్తాం.

పార్టీ క్యాడర్ అంతా నా వెంటే ఉంది

నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ అంతా నా వెంటే ఉంది. ఎన్నికలకు ముందు బీజేపీలోకి వెళ్లి, పార్టీ అధికారంలోకి రావడంతో తిరిగి వచ్చిన కొందరు మాత్రమే ఓ గ్రూపుగా వ్యవహరిస్తున్నారు. వారితోనూ నాకు పేచీ లేదు. పార్టీ కోసం పనిచేసే వారందరినీ కలుపుకుని వెళ్తా. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

గాంధారిలో స్టేడియం

గాంధారి మండల కేంద్రంలో రూ.5 కోట్లతో స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం. ఐదు ఎకరాల భూమి కూడా అలాట్ అయ్యింది. అక్కడ క్రీడాకారులు ఎక్కువగా ఉన్నారు. స్టేడియం ఏర్పాటుతో యువతకు ఎంతో మేలు కలుగుతుంది. తాడ్వాయిలో స్టేడియం కోసం ప్రయత్నిస్తున్నా. నియోజకవర్గ యువత కోసం త్వరలోనే భారీ జాబ్‌మేళా నిర్వహించేందుకు ప్లాన్ చేశాను.

మంత్రి మాట ఇచ్చారు

ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు దశాబ్దాల కల. దాన్ని సాధించి తీరుతా. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పలుమార్లు చర్చించా. తప్పనిసరిగా బస్‌డిపో ఏర్పాటు చేయిస్తానని మాట ఇచ్చారు. వెనుకబడిన ఎల్లారెడ్డి ప్రాంతంలో అన్ని గ్రామాలకు బస్సులు నడవాలంటే బస్‌డిపో అవసరమన్న విషయాన్ని మంత్రికి వివరించా. ఆయన సానుకూలంగా ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు..

ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ఎక్కడికి వెళ్లినా తాగునీటి సమస్య ఉందని ప్రజలు ఆవేదన చెందారు. ముఖ్యంగా గాంధారి, తాడ్వాయి మండలాల్లో నీటి సమస్య పరిష్కారానికి 320 బోర్లు తవ్వించి మోటార్లు బిగించాను. దాదాపు రూ.3.50 కోట్లు ఖర్చయ్యాయి. మొన్నటి సీజన్‌లో బోర్లు ఎంతగానో ఆదుకున్నాయి. మిషన్ భగీరథకు సంబంధించిన కొన్ని పనులు చేయించడానికి రూ.కోటి వరకు ఖర్చు చేశాం. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నా.

పెద్దచెరువు కట్ట మీద మాజీ ఎమ్మెల్యేల విగ్రహాలు

ఎల్లారెడ్డి పట్టణంలో ప్రజలు సేద తీరడానికి పార్కులు లేక ఇబ్బంది పడుతున్నారు. పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తున్నాం. రూ.4 కోట్లతో పనులు చేపట్టాం. కట్ట మీద కిలోమీటర్ మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తున్నాను. చెరువు కింద ఎకరంనర భూమి తీసుకుని అక్కడ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలుగా పనిచేసి చనిపోయిన టీఎస్ సదాలక్ష్మి, ఈశ్వరీబాయి, టి బాలాగౌడ్, ఎల్ కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి విగ్రహాలను కట్టపై ఏర్పాటు చేస్తాం. లింగంపేటలోని నాగన్నబావిని పర్యాటకంగా అభివృద్ధి చేశాం. తాండూరు త్రిలింగేశ్వరాలయానికి రూ.25 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులు మొదలు పెడతాం.

బాధితుల ఇంటి వద్దకే చెక్కులు

ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎల్‌వోసీలు, సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం పెద్ద సంఖ్యలో ఇప్పించి ఆదుకున్నాను. చెక్కులను బాధితుల ఇంటికి పంపించే ప్రక్రియను చేపట్టాను. వాళ్లు ఎంతో సంతోషంగా స్వీకరించారు. వైద్యం కోసం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఎల్‌వోసీ వెంటనే ఇప్పించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశాను. రాజకీయాలకు సంబంధం లేకుండా బాధితుల తరఫున ఎవరు సిబ్బంది వద్దకు వెళ్లినా వారికి పనిచేయించి ఆదుకుంటున్నాను. ఎల్‌వోసీలు 1500 వరకు ఇచ్చాను. వాటి విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుంది. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు దాదాపు 2 వేలు ఇప్పించాను.

లింగంపల్లి సెజ్‌లో ఆగ్రో పరిశ్రమలు

ఎల్లారెడ్డిలో ఐటీ కారిడార్ కోసం 50 ఎకరాల భూమి కేటాయించాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్‌ను కలిసి ఐటీ కారిడార్ కోసం ప్రయత్నాలు చేశాను. ఐటీ కారిడార్ ఏర్పాటైతే ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. అలాగే లింగంపల్లి సెజ్‌లో ఇప్పటికే వివేక్ బయోటెక్ కంపెనీకి భూమి పూజ చేసింది. ఏడాదిలో అది పని ప్రారంభిస్తుంది. మరో మూడు కంపెనీలు త్వరలోనే రానున్నాయి. దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయి.

న్యూస్‌రీల్

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి



కామారెడ్డి క్రైం: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ద్వారా ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో పలువురు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. ఇందులో కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలకు చెందిన నాయకులు గడుగుల శ్రీనివాస్, ఇబ్రమోస్, మన్సూర్ బలపర్చిన మధుసూదన్ రెడ్డి విజయం సాధించినట్లు కాంగ్రెస్ వర్గాలు గురువారం తెలిపాయి. మధుసూదన్‌రెడ్డిని పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

జిల్లాలో ఆటోల బంద్ లేదు

కామారెడ్డి అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7న నిర్వహిస్తున్న ఆటోల బంద్‌కు తాము మద్దతు ఇవ్వడం లేదని ఆటో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోలు యథావిధిగా తిరుగుతాయని చెప్పారు. ఈ నెల 20న జిల్లా జేఏసీ సమావేశమై ఆటో డ్రైవర్ల సమస్యలపై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.634 కోట్లు మంజూరు

నిజాంసాగర్: జిల్లా మీదుగా వెళ్తున్న సంగారెడ్డి – నాందేడ్ జాతీయ రహదారి నుంచి బోధన్ వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణకు రూ.634 కోట్లు మంజూరైనట్లు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తెలిపారు. ఎన్‌హెచ్ 161 బీబీ రహదారిని మద్నూర్ నుంచి బోధన్, రుద్రూర్ వరకు విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరు కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రహదారి విస్తరణతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

ఉచిత బస్సును సద్వినియోగం చేసుకోవాలి



కామారెడ్డి అర్బన్: మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం బస్సులో మహిళా ప్రయాణికులతో నిజామాబాద్ రీజియన్ డిప్యూటీ మేనేజర్ శంకర్, కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడారు. బస్సులో ఉచిత ప్రయాణం ఎలా ఉందని ఆరా తీశారు. బస్సుల సంఖ్య పెంచి చేయి ఎత్తిన చోట ఆపాలని మహిళలు వారిని కోరారు.

నేడు బీజేపీ ధర్నా

కామారెడ్డి అర్బన్: బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి నరేందర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

కేసులకు భయపడేది లేదు

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



కామారెడ్డి క్రైం/ఎల్లారెడ్డి: పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆరోపించారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయగా వారిని పరామర్శించడానికి బయలుదేరిన తనను, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రా నంద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి మోకిల పోలీస్ స్టేషన్‌కు తరలించారని చెప్పారు. ఇదెక్కడి ప్రజాపాలన అని ప్రశ్నించారు. ప్రజల తరఫున పోరాటం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడతామంటే భయపడేది లేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అక్రమ కేసులు పెడుతున్న తీరుపై ఆయన మండిపడ్డారు.

రైతులు మట్టి పరీక్షలు చేయించాలి



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు పంటలు సాగు చేసే ముందు తమ చేనుల్లో మట్టికి పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన లింగంపేట మండలం పోల్కంపేట గ్రామంలో ప్రపంచ మృత్తిక దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. నేల స్వభావం, రకాలు వాటిలో ఏఏ పంటలు సాగు చేయాలో వివరించారు. రైతులు వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చవద్దన్నారు. వాటిని కలియ దున్నితే భూసారం పెరుగుతుందన్నారు. మట్టి నమూనాలు ఏలా సేకరించాలో వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉండి పంటల మార్పిడి, భూసారం, నేల స్వభావం తదితర అంశాలపై సూచనలు చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తీర్ణాధికారులు మధుసూదన్, షేక్ అమీర్, సంతోష్‌కుమార్, రాకేష్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్



బాన్సువాడలో మాట్లాడుతున్న డీఈవో రాజు

బాన్సువాడ: బాన్సువాడలో శుక్రవారం నుంచి జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ నిర్వహించనున్నట్లు డీఈవో రాజు అన్నారు. గురువారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం బాన్సువాడ డివిజన్ కేంద్రంలో సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నామని చెప్పారు. 400 పైగా ప్రాజెక్టులను ప్రదర్శించే అవకాశం ఉందని, ఇది వరకు ఇన్‌స్పైర్‌కు 78 ప్రాజెక్టులను ఎంపిక చేశామని చెప్పారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభా కనబర్చిన 23 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రాజెక్టులను ప్రదర్శించే విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం వసతి గృహాల్లో బస కోసం ఏర్పాటు చేశామని, భోజనాల నదుపాయాన్ని వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఏర్పాటు చేశారని చెప్పారు. వైజ్ఞానిక సదస్సుకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామిరెడ్డి, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి కుశాల్, తపస్ జిల్లా కార్యదర్శి భూనేకర్ సంతోష్, పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు నరహరి ఉన్నారు.

కప్పకున్న మంచు దుప్పటి

నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటను గురువారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా 10 మీటర్ల దూరంలో ఉన్న వారు కూడా కనిపించనంతగా మంచు కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– నాగిరెడ్డిపేట



గోపాల్‌పేటలో కమ్మేసిన పొగమంచు

లక్ష్యానికి అనుగుణంగా రుణాలు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను లక్ష్యానికి అనుగుణంగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రెండో త్రైమాసిక బ్యాంకర్ల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. పలు రకాల రుణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, రెండో త్రైమాసికంలో సాధించిన ప్రగతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సాధించవలసిన ప్రగతిపై చర్చించినట్లు తెలిపారు. వార్షిక రుణ ప్రణాళిక వ్యయం రూ.4,695 కోట్లు ఉండగా సెప్టెంబర్ చివరికి రూ.2,030 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రణాళిక ప్రకారంగా రుణాల మంజూరులో ప్రగతి సాధించాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం రెహమాన్, ఎల్‌డీఎం రవికాంత్, డీఆర్‌డీవో సురేందర్ పాల్గొన్నారు.

వార్డు సంఖ్యలను సరి చేయాలి

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో తప్పుగా నమోదైన వార్డు సంఖ్యలను సరిచేయాలని కలెక్టర్ సంగ్వాన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్డీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో గ్రామాల్లోని వార్డుల నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు గుర్తించామన్నారు. ఓటరు జాబితా ప్రకారం వార్డు నంబర్లను వెంటనే సరిచేయాలన్నారు. మున్సిపల్ వార్డులలోని నంబర్లను సైతం సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చేలోగా సరిచేసుకోవాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీపీవో శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కిపోయిన బియ్యం సరఫరాపై ఫిర్యాదు

ఎల్లారెడ్డి: ముక్కిపోయి వెనక్కి పంపించిన బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట మండలాల డీలర్లు గురువారం ఫిర్యాదు చేశారు. ఎల్లారెడ్డి సివిల్ సప్లై గోదాం నుంచి పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గోదాంలో ఏనాటి నుంచే ఉన్న ముక్కిపోయిన బియ్యాన్ని కలిపి పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎస్‌వో, సివిల్ సప్లయి డీఎంలకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. రేషన్ డీలర్లు విఠల్‌గౌడ్, ప్రభాకర్, నాగం సురేందర్ పాల్గొన్నారు.

సమగ్ర నివేదిక సమర్పిస్తాం



అభ్యర్థనలు స్వీకరిస్తున్న కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు
- స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల దామాషాపై విజ్ఞాపనల స్వీకరణ

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించేందుకు ఏర్పాటైన బీసీ డెడికేటెడ్ కమిషన్ నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం ప్రజాభిప్రాయాలను సేకరించింది. ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాకు చెందిన కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల నుంచి కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి సైదులు రాతపూర్వకంగా వినతులను స్వీకరించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషన్ చైర్మన్‌కు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వివిధ సంఘాల ప్రతినిధులు తమతమ కులాలవారి ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులను కమిషన్ చైర్మన్‌కు వివరిస్తూ విజ్ఞాపనలను సమర్పించారు. కుల సంఘాలను ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేస్తే మేలు జరుగుతుందని, బీసీలకు రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఎలా ఉండాలనేదానిపై హైకోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటైందని అన్నారు. ఈ మేరకు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 8 ఉమ్మడి జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేయడం జరిగిందని, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తరువాత సమగ్ర నివేదికను సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్‌కుమార్, కామారెడ్డి జెడ్పీ సీఈవో చందర్‌రాథోడ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికై ఏడాదవుతున్నా చేసిందేమీ లేదు



కామారెడ్డి అర్బన్:ఎన్నికై ఏడాదవుతున్నా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మట్లాడారు. ఫిర్యాదు పెట్టెల్లో ఎన్ని విజ్ఞప్తులు వచ్చాయో.. ఎన్ని పరిష్కారమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చేస్తున్న అభివృద్ధిని సహించలేక ప్రోటోకాల్ జగడం మొదలు పెట్టారన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు కారంగుల అశోక్‌రెడ్డి, ఐరేని సందీప్, తేజపు ప్రసాద్, రాజాగౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



పిట్లం(జుక్కల్): తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజనం సమయంలో ఒప్పంద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రమబద్ధీకరించేంత వరకు కనీసం పేస్కేల్ అమలు చేస్తూ.. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జలాల్‌పూర్, ఆత్మకూర్, మాటూర్, మాసాన్‌పల్లి గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను గురువారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాలలో ఉన్న వసతులను ఆయన పరిశీలించారు. ఓటర్ల వివరాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, రవీందర్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం..

జలాల్‌పూర్, మాటూర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను గురువారం ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని పరిధిలోని పీజీ, ఎల్ఎల్‌బీ రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు ఈ నెల 12న సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ అరుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ, ఎల్ఎల్‌బీ 1, 2, 3, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలు(నవంబర్/ డిసెంబర్)లో ప్రకటించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.500 రీవాల్యుయేషన్ ఫామ్‌కు రూ.25లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

‘సీఎం కప్’ నిర్వహణకు స్థలాలు కరువు

- 7 నుంచి క్రీడా పోటీలు
- గ్రామాల్లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



దౌల్తాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల 7 నుంచి నిర్వహించనుంది. అయితే పోటీల నిర్వహణకు గ్రామాల్లో, మండలాల్లో క్రీడా ప్రాంగణాలు కరువయ్యాయి. కొన్ని పాఠశాలల్లో మైదానాలు లేకపోవడంతో పోటీలను ఎక్కడ నిర్వహించాలని అధికారులు, ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం ఈజీఎస్ పథకం ద్వారా రూ.లక్షల నిధులు వెచ్చించి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వీటి నిర్వహణ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చూడాల్సి ఉంటుంది. ఆహ్లాదకర వాతావరణం కోసం క్రీడా ప్రాంగణం చుట్టూ చెట్లు పెంచాలని సూచించింది. చాలాచోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయకుండానే అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం మైదానాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. జిల్లాలో ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడ కూడా క్రీడా మైదానాలు లేవు. అవి కూడా నిర్వహణ లేక పిచ్చిమొక్కలు, రాళ్ల దర్శనమిస్తున్నాయి. గ్రామాలు, మండలాల్లో క్రీడా మైదానాలు లేకపోండంతో సీఎం కప్ పోటీలు నిర్వహించేందుకు అన్ని వసతులు ఉండే విధంగా అధికారులు స్థలాలను వెతుక్కునే పనిలోపడ్డారు. గ్రామీణ క్రీడా మైదానాల నిర్వహణ కోసం ప్రభుత్వం జీపీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే అన్ని సక్రమంగా చూసుకోవచ్చని జీపీ అధికారులు అంటున్నారు. ఇప్పటికే సిబ్బంది వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బిచ్కుంద బాలికల హైస్కూల్‌లో ఇరుకుగా ఉన్న మైదానం

క్రీడల్లో తప్పకుండా పాల్గొనాలి

ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ, మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీల్లో జీపీ పరిధిలోని యువకులు తప్పకుండా పాల్గొనాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సీఎం కప్ పై అవగాహన కల్పించారు. ఈ నెల 7, 8న గ్రామ స్థాయి, 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు మండలస్థాయి పోటీలు నిర్వహిస్తారు. పుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నారు. మండలస్థాయిలో గెలుపొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారు. విజేతలకు పతకాలతోపాటు నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నారు.

జుక్కల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇమ్రోజ్



ఇమ్రోజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పిట్లం(జుక్కల్): ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ యూత్ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పిట్లంకు చెందిన ఇమ్రోజ్ ఎన్నికయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం ఇమ్రోజ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మండ్లు ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇమ్రోజ్ విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ నజీర్, మోహన్ రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు బొడ్లరాజు, మైనార్టీ అధ్యక్షుడు మొయిన్ పాల్గొన్నారు.

బీబీపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేష్

బీబీపేట: బీబీపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన మల్లుగారి మహేష్ ఎన్నికయ్యాడు. రెండు నెలల క్రితం ఓటింగ్ నిర్వహించగా మహేష్‌కు 763 ఓట్లు లభించాయి. దీంతో అధిష్టానం మహేష్‌ను అధ్యక్షుడిగా ప్రకటించింది. పార్టీ కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని మహేష్ పేర్కొన్నారు.



మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ..తనపై ఉన్న నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పని చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శ్రీనివాస్‌ను సన్మానించారు. జుక్కల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులుపాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తాడ్వాయివాసి ఎంపిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన మద్ది విశాల్‌రెడ్డి అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. విశాల్ ఇటీవల నిజామాబాద్ జిల్లా మగ్గిడిలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 10, 11 తేదీలలో మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. మాజీ సర్పంచ్ సంజీవులు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, వీడీసీ చైర్మన్ రాజు, పీడీ బాలు, తదితరులు విశాల్‌ను అభినందించారు.

సర్జరీ లేకుండా కిడ్నీలో రాళ్ల తొలగింపు

బాన్సువాడ: పట్టణంలోని సెవన్స్ హిల్స్ నర్సింగ్ హోంలో గురువారం సర్జరీ లేకుండానే కిడ్నీలో ఉన్న రాళ్లను తొలగించినట్లు వైద్యులు వాగ్దేవి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. నరసమ్మ అనే రోగి కిడ్నీలో ఉన్న రాళ్లతో బాధపడుతుందని, ఆపరేషన్ కోసం తమ ఆస్పత్రికి వస్తే సర్జరీ లేకుండా మొదటిసారిగా లేజర్ చికిత్స ద్వారా రాళ్లను తొలగించామని చెప్పారు. కిడ్నీ వ్యాధులకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా బాన్సువాడలోనే చికిత్స చేసుకోవచ్చునని అన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



కొండా పవన్ కుమార్(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కేపీఆర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన కొండా పవన్ కుమార్(42) రెండేళ్ల క్రితం కామారెడ్డికి వచ్చి వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కేపీఆర్ కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వరకు బ్యాంకు రుణం, ఇతర అప్పులు చేశాడు. పని సరిగ్గా లేకపోవడం, అప్పులు, వాయిదాలు కట్టలేక కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

87 వాహనాలు సీజ్



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో సబ్ డివిజన్‌లోని ఆయా పీఎస్‌ల అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, నంబర్ ప్లేట్, హెల్మెట్, డ్రంకన్ డ్రైవ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేశారు. వాహన ధ్రువపత్రాలు సక్రమంగా లేని మొత్తం 87 వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

రెంజల్:ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.మండలంలోని కందకుర్తి నుంచి పేపర్‌మిల్ గ్రామానికి బుధవారం అర్ధరాత్రి మూడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ల వద్ద ఇసుక అనుమతికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాహనాలను పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

రెండు ఇసుక లారీలు..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకుని సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలించడంతో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ శివారులో ఉన్న భూవివాదంలో తలెత్తిన ఘర్షణలో పరస్పరం ఫిర్యాదులు అందడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. తన భూమి కబ్జా ప్రయత్నాన్ని అడ్డుకున్నందుకు మధుసూదన్‌రెడ్డి, నల్ల హరీశ్‌రెడ్డి, నల్ల నరేశ్‌రెడ్డి దాడికి పాల్పడ్డారని బొడ్డు గంగారెడ్డి, ఆయన కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారని తెలిపారు. వారి నుంచి ప్రాణహాని ఉందని, తనకు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారందరిపై కఠినచర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బొడ్డు గంగారెడ్డి, కౌలుదారుడు గుండు నాయక్, డ్రైవర్ శుభంతోపాటు మరికొందరిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.

జేసీబీ, టిప్పర్లు స్వాధీనం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎత్తొండ క్యాంపు శివారులో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా ఉన్న జేసీబీ, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ గురువారం పేర్కొన్నారు. తగుచర్య నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

రుద్రూర్: చోరీ కేసులో నిందితుడు అశోక్‌కు ఏడాది జైలు శిక్షను బోధన్ అడిషనల్ జడ్జి ఈ సాయిశివ విధించారని ఎస్సై సాయన్న గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2017నవంబర్19న రుద్రూర్ గ్రామానికి చెందిన మొత్కురి శశికళ ఇంట్లో మూడు తులాల బంగారాం, పది తులాల వెండి ఆభరణాలు, రూ. వెయ్యి నగదు చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బోధన్‌కు చెందిన ఎ అశోక్‌ను అరెస్ట్ చేసి చోరీకి గురైన వస్తువులను రికవరీ చేసి చార్జిషీట్ వేశారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

జానకంపేటలో బైక్ చోరీ

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన జి విజయ్ తన బైక్‌ను గురువారం ఉదయం ఇంటి ఎదుట నిలుపగా దుండగులు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. అదే విధంగా గ్రామానికి చెందిన ఇద్దరి బైకులు సైతం మంగళవారం చోరీకి గురికాగా ఒకరి బైక్ సాయంత్రానికి దొరకగా మరొకరి బైక్ దొరకలేదు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

డీఆర్‌డీవో సురేందర్



నర్సన్నపల్లిలో మునగ తోటకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేస్తున్న డీఆర్‌డీవో సురేందర్

కామారెడ్డి రూరల్: రైతులు తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. నర్సన్నపల్లిలో గురువారం చిదుర శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఫిష్ పాండ్‌లో 1500 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ఒక ఎకరం, భాస్కర్ రెడ్డి ఒక ఎకరం పొలంలో మునగ తోట వేయడానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా కొటాల్‌పల్లికి చెందిన గోపాల్ కూరగాయలు, మునగ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. రైతులు ప్యాడి తగ్గించి తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే మార్గాలను ఎంచుకోవాలన్నారు. చిదుర శ్రీనివాస్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని గ్రామానికి చెందిన మిగితా రైతులు కూడా చేపల పెంపకాన్ని చేపడితే బాగుంటుందని అన్నారు. రైతుకు సహకరించిన ఎంపీడీవో నాగవర్ధన్‌ను డీఆర్‌డీవో ఈ సందర్భంగా అభినందించారు. ఐకేపీ ఏపీఎం మోహిజ్, సీసీ విశ్వనాథం, ఏపీవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఏడాది పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు’



కామారెడ్డి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు



బాన్సువాడలో ..

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలన పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరేందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ‘ఆరు గ్యారెంటీలు-66 అబద్ధాలు’పై పట్టణంలోని సీఎస్ఐ మైదానం నుంచి బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్‌రోడ్డు ఇతర ప్రధాన వీధుల గుండా దేవునిపల్లి వరకు బీజేపీ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏడాదిపాలనలో కొత్తగా ఒక్కరికి పెన్షన్, రేషన్‌కార్డు, పక్కా ఇల్లు మంజూరు చేయలేదని దుయ్యబట్టారు. సీఎం, ప్రతిపక్షాలకు తిట్టడం తప్ప చేసిందేమి లేదన్నారు. సమయం వచ్చినపుడు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నీలం చిన్నరాజులు, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎం.శ్రీకాంత్, బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్య పరిచేందుకే ప్రజాయాత్రలు

బాన్సువాడ: కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరిచేందుకు బీజేపీ చైతన్య యాత్రల కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీజేపీ నేత కోనాల గంగారెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, అప్పట్లో పీసీసీ హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నీటి మీద బుడగల్లాగే మారాయని అన్నారు. నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్, శంకర్‌గౌడ్, హన్మండ్లు, సాయికిరణ్, ప్రసాద్, శంకర్, పాశం భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివశంకర్, తదితరులున్నారు.

మొక్కలు నాటారు.. చెట్లను నరికేశారు



ఇసన్నపల్లిలో సగం వరకు నరికేసిన చెట్టు

రామారెడ్డి : అధికారుల అనాలోచిత పనులతో ప్రజాధనం వృథా అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు మొక్కలు నాటారు. మొక్కలు ఎక్కడ నాటుతున్నాం అనేది వాళ్లు అప్పుడు చూడలేదు. నాటిన మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తుండడంతో నరికేస్తున్నారు. రామారెడ్డి మండల పరిధిలో కొన్ని చోట్ల చెట్లను పూర్తిగా తొలగిస్తుండగా మరికొన్ని చోట్ల సగభాగం చెట్లను నరికేస్తున్నారు. నాటేటప్పుడు ఆలోచించకుండా పనులు చేయడంతో ఈ పరిస్థితి వచ్చింది.

సంక్షిప్తం

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని, రైతుభరోసా రూ.15 వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గంగాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘ్ మండలాధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, జిల్లా బాధ్యులు ఏనుగు లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన 41 మందికి రూ. 41,04, 756 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నేతలు ఎల్లమయ్య, గోపాల్, పూల్ సింగ్, నగేష్, రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని చావునితండాలో గురువారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువు వైద్యాధికారి మణి కుమార్ మాట్లాడుతూ.. తండాలో 41 పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు, 11 సాధారణ చికిత్సలు చేసి, 27 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది బస్వరాజు, గంగారాం, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. గురువారం తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్–14 నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థి దశలో ఎంతో కీలకమని అన్నారు. అండర్–14 నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లాలో 18 టీమ్‌లు పాల్గొనగా మొదటి స్థానం బాలుర విభాగంలో అభ్యాస పాఠశాల, రెండో స్థానంలో మిట్టాపల్లి ఉన్నత పాఠశాల, మూడో స్థానంలో సుద్దులం ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలువగా, బాలికల విభాగంలో మొదటి స్థానం సుద్దులం ఉన్నత పాఠశాల, రెండో స్థానం మిట్టాపల్లి ఉన్నత పాఠశాల, మూడో స్థానం తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాల నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం సీతాదేవి తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు.

లాడ్జి మేనేజర్ అరెస్ట్

జక్రాన్‌పల్లి: మైనర్ బాలిక అత్యాచారం కేసులో నిందితుడికి సహకరించిన నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటసాయి లాడ్జి మేనేజర్ సత్యనారాయణను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపారు. పోక్సో కేసులో నిందితుడికి వెంకటసాయి లాడ్జ్ రూం ఇచ్చాడు. అక్టోబర్ 1న ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన అజయ్ జక్రాన్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నిర్మల్‌లోని వెంకట సాయిలాడ్జికి తీసుకెళ్లాడు. మేనేజర్ సత్యనారాయణ నిందితుడి వద్ద ఎక్కువ డబ్బులు తీసుకుని ఓనర్‌కు తెలియకుండా రూం ఇచ్చాడు. నిందితుడు బాలికపై అత్యాచారం చేశాడు. అక్టోబర్ 30న బాధితురాలి ఫిర్యాదు మేరకు జక్రాన్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు అజయ్‌ని అక్టోబర్ 31న పట్టుకుని జైలుకు పంపించారు. నిందితుడు తెలిపిన ఇతర ఆధారాల ప్రకారం వెంకటసాయి లాడ్జి మేనేజర్ సత్యనారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జిల్లా చుట్టు పక్కల ప్రాంతాల్లో లాడ్జి, హోటళ్ల నిర్వాహకులు అమ్మాయిలను లాడ్జికి తీసుకొచ్చే వారికి రూంలు ఇవ్వొద్దని సూచించారు. ఎవరైన డబ్బులకు ఆశపడి ఇలాంటి నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.